సొదరదిన్నె.. సమస్యలు తీరె !

- గ్రామంలో రూ. 4.37 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ భవనాలతో కొత్త శోభ
- తాగునీటి కష్టాలకు చెక్... మెరుస్తున్న సీసీ రోడ్లు
- ఏళ్లనాటి సమస్యలు పరిష్కారం... సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ. 56.80 లక్షలతో సచివాలయం, ఆర్బీకే భవనాలను ఒకే చోట ఏర్పాటు చేసిన దృశ్యం

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో పల్లెలు మెరిసి పోతున్నాయి. గ్రామస్థాయిలో ప్రభుత్వ భవనాలు ఏర్పాటు కావడంతో పల్లెకు కొత్త శోభ సంతరించుకుంది. కోవెలకుంట్ల మండలంలోని సొదరదిన్నె, అమడాల, గుంజపాడు గ్రామాలతో సొదరదిన్నె సచివాలయం ఏర్పాటైంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో గడిచిన ఐదేళ్లలో గ్రామంలో రూ. 4.37 కోట్లతో చేపట్టిన పనులు అభివృద్ధికి అద్దం పడుతున్నాయి. గ్రామం పట్టణాన్ని తలపించేలా ఒకేచోట గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రానికి కొత్త భవనాలు, పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీరిపోయాయి. అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరించడం శాశ్వత మౌలిక వసతుల కష్టాలు తొలగిపోయాయి. ఏళ్లనాటి సమస్యలు తీరాయంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు సొదరదిన్నె ప్రజలు.

ఇది కదా.. అభివృద్ధి

తాగునీటి కష్టాలకు చెక్

పీడబ్ల్యూఎస్ ద్వారా గ్రామంలోని ఆయా కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి గతంలో మోటార్లు చెడిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర కారణాలతో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొనేవారు. ఎమ్మెల్యే కాటసాని సహకారంతో జలజీవన్ మిషన్ ద్వారా రూ. 26 లక్షల నిధులు మంజూరు కావడంతో ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో పైప్‌లైన్, కుళాయిలు, బోర్లు ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి కష్టాలకు చెక్ పడింది. అలాగే గ్రామస్తులకు మినరల్‌వాటర్ అందజేయాలన్న ఉద్దేశంతో రూ. 5 లక్షలతో వాటర్‌ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్టీసీ బస్‌స్టాప్ సమీపంలో ఏర్పాటైన కాలనీలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులకు రోడ్డు కష్టాలు తొలగిపోయాయి. నాడు- నేడు



రూ. 20.50 లక్షలతో వైఎస్సార్‌హెల్త్‌క్లినిక్ భవనం

కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల మరమ్మతులు, బాత్‌రూం, మరుగుదొడ్లను నిర్మించారు. గ్రామ శివారులోని శ్మశాన వాటిక రహదారి అధ్వాన్నంగా ఉండేది. మృతదేహాలను తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. రూ. 5 లక్షలతో రహదారి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు:

- రూ. 3 కోట్లతో కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 35 లక్షలతో గ్రామ సచివాలయ భవనం
- జలజీవన్ మిషన్ ద్వారా రూ. 26 లక్షలతో బోర్లు, పైప్‌లైన్ నిర్మాణం
- రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ. 20.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం
- నాడు- నేడు కార్యక్రమం ద్వారా రూ. 16 లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు
- రూ. 10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ. 5 లక్షలతో చురుగ్గా సాగుతున్న మినరల్‌వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులు
- రూ. 3 లక్షలతో స్మశాన వాటికలో అభివృద్ధి పనులు



రూ. 3 కోట్లతో ఆర్అండ్‌బీ రహదారిలో సీసీరోడ్డు



రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు

రూ. 4.37 కోట్లతో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గడిచిన ఐదేళ్లలో రూ. 4.37 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చాం. గతంలో ఎప్పుడూ ఇంత అభివృద్ధి జరగలేదు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం. - మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్, సొదరదిన్నె

ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి



నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో చిన్నపాటి వర్షం వచ్చినా పాఠశాల ఆవరణమంతా బురదమంగా మారి పిల్లలు అవస్థలు పడేవారు. లోతట్టుగా ఉన్న ప్రాంతాన్ని గ్రావెల్‌తో నింపి బురద కష్టాలు తొలగించారు. విద్యార్థులకు బాత్‌రూంలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. - శివమ్మ, సొదరదిన్నె

అన్ని వసతులు సమకూరాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో అన్ని వసతులు సమకూరాయి. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో ప్రభుత్వ భవనాలు కళకళలాడుతున్నాయి. సచివాలయం సేవలు బాగున్నాయి. అంతర్గతరోడ్లు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించడంతో ప్రజలకు కష్టాలు తీరిపోయాయి. గతంతో పోలిస్తే మా గ్రామం చాలా అభివృద్ధి జరిగింది. - ఏరాశి లక్ష్మీకాంతరెడ్డి, సొదరదిన్నె

క్లుప్తంగా

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



బేతంచెర్ల పట్టణంలో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ప్రధాన రహదారి, మెయిన్ బజార్, పాత తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీల్లో ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతవారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

పరిసరాల శుభ్రత పాటించండి



రైల్వే కాలనీలో మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ జయరాం

డోన్ : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని 14వ వార్డు కాలనీల్లో గురువారం డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాతో కలిసి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోగలిగితేనే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. అంటువ్యాధులను సైతం దూరంగా ఉంచుకోగలుగుతామన్నారు. ఈ సందర్భంగా మురుగు కాల్వల్లో దోమల లార్వా నియంత్రణకు ఆయిల్ బాల్స్‌ను సిబ్బందితో స్వయంగా వేయించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ



పానకం పంపిణీ చేస్తున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని సౌత్ ఇండియా కార్యాలయం ఆవరణలో పూదోట శివ భక్త బృందం ఆధ్వర్యంలో బాటసారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎస్ఐ శివ శంకర్ నాయక్‌తో కలిసి సీఐ ప్రియతం రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు గౌరి హుసేన్‌రెడ్డి, గుండాగోపాలు, మారుతి కృష్ణ, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, బచ్చు సుబ్రహ్మణ్యం, నాగ మోహన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



డి.ఇంద్రజ, బందికె దీక్షిత

డోన్ టౌన్ : సైనిక్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి ఆల్ ఇండియా స్థాయిలో ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన దండగల ఇంద్రజ, బి.బొంతిరాళ్ల గ్రామానికి చెందిన బందికె దీక్షిత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంద్రజ 300లకు 227 మార్కులు, కుమార్తె దీక్షిత 225 మార్కులు సాధించింది. వీరు ఆల్ ఇండియాలో 15,366, 16,401 ర్యాంకులు సాధించి ప్రవేశాలకు అర్హత సాధించారు.

నివాళి



అప్పారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం అప్పారి వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పారి ఉద్యమ స్ఫూర్తిని ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు నరసింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి గోపాల్, ప్యాపిలి మండల అధ్యక్షులు కృష్ణానాయక్, నాయకులు సంజీవరాయుడు, వేణుగోపాల్, నాగలక్ష్మయ్య, శ్రీనివాసులు, మద్దిలేటి, మురళి, రహీం, సుమన్, చంద్రమోహన్, మధు, రామాంజనేయులు, రమేష్‌నాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో రీసైక్లింగ్ వలసలు!

- టీడీపీలో ఉన్న వాళ్లకే కండువాలు కప్పుతూ ప్రచారం
- ప్రలోభాలకూ పాల్పడుతున్న వైనం



రెండు రోజుల క్రితం టీడీపీలో చేరిన వారితో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలు టీడీపీకి ప్రతిష్టాత్మకం కావడంతో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు కిందమీద పడుతున్నారు. టీడీపీలో ఉన్న వాళ్లకే మళ్లీ కండువాలు కప్పి కొలిమిగుండ్ల మండలంలో టీడీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయని ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎక్కువ మంది టీడీపీలోకి చేరుతున్నారని పబ్లిసిటీ చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. దాదాపు ఇరవై రోజుల క్రితం టీడీపీలో కండువాలు కప్పుకున్న వాళ్లకే మళ్లీ టీడీపీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీకి భారీ షాక్ అంటూ మానసిక ఆనందం పొందుతున్నారు టీడీపీ నాయకులు. 2014 నుంచి టీడీపీలో కొనసాగుతున్న వాళ్లను వదిలిపెట్టకుండా కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుంటున్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు పాత వాళ్లకే కండువాలు వేసి రీసైక్లింగ్ వలసలు చేసుకోవడంతో స్థానికులు నవ్వుకుంటున్నారు. రెండు రోజుల క్రితం కొలిమిగుండ్లకు చెందిన ఇద్దరు ముగ్గురు కాపులు బనగానపల్లెకు వెళ్లి టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారు. మిగిలిన వాళ్లంతా టీడీపీలో కొనసాగుతున్న వాళ్లే. అయితే వాళ్లను కూడా టీడీపీ ఖాతాలో జమ చేసుకున్నారు. ఎవరూ చేరినా వైఎస్సార్‌సీపీ నుంచి వలసలు అంటూ హంగామా చేస్తున్నారు. అంకిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో సైతం ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. టీడీపీ నాయకులకు చెందిన నాపరాతి గనుల్లో పని చేసే కార్మికులను మాట్లాడాలని పిలిపించుకొని బనగానపల్లెకు తీసుకెళ్లి టీడీపీ కండువాలు కప్పారు. అబ్దులాపురంలో దూదేకుల కుటుంబాలకు చెందిన యువకులను గ్రామ టీడీపీ నాయకులు పీర్ల చావిడికి డబ్బులు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి తీరా అక్కడికి వెళ్లాక టీడీపీ కండువాలు వేశారు. దీంతో యువకులు టీడీపీ గ్రామ నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కొలిమిగుండ్ల మండలంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండటంతో ఎలాగైనా ఈసారి ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసి టీడీపీ మెజార్టీ సాధించేందుకు రక రకాల కుయుక్తులు పడుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తాం, మసీదులకు డబ్బులు ఇస్తాం, ప్రమాద బీమా చెల్లిస్తాం అంటూ అని ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారు టీడీపీ నాయకులు.

టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ఓబులరెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గుళ్లదూర్తి టీడీపీ నాయకులు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని పెండేకంటినగర్ బీసీ కాలనీకి చెందిన టీడీపీ వర్గీయులైన 16 కుటుంబాల సభ్యులు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ఓబులరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీసీ కాలనీకి చెందిన మధు, సుధాకర్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, రాధ, ప్రసాద్, ఎలిసన్న వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, బాలస్వామి, ఏడుకొండలు, నాగరాజు, కృష్ణ, బోయ వెంకటేశ్వర్లు, బోయలక్ష్మీదేవి, జ్యోతి సునీత తదితరులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ఓబులరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుళ్లదూర్తి నాయకుల చేరిక...

కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన వార్డు సభ్యులు కర్నాటి అరవిందరెడ్డి, కర్నాటి ఓబుళరెడ్డితో పాటు మాల భాస్కర్ మరో 30 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జగిన ఈ కార్యక్రమంలో కాటసాని మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పార్టీలకు అతీతంగా పేదలందరికీ అందజేశారన్నారు. సీఎం సంక్షేమ పాలనకు ఆకర్షితులై చాలామంది టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని గుర్తు చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపునిస్తామని, అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్ : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని పాంచ్ కమాన్ మసిద్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మసిద్ కమిటీ సభ్యుల పిలుపు మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువ నేత కాటసాని ఓబులరెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అత్తార్‌జాహెద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, కూరగాయాల మహబూబ్‌బాషా, ముత్తవలి మనవర్, షఫీ, అత్తార్ ఖాదర్ బాషా, హబీబ్, చాంద్, ఆరీఫ్, కార్పెంటర్ రఫీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మాలిక్‌బాబా దేవస్థానంలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని శ్రీరామచంద్ర మాలిక్ బాబా సంస్థాన్‌లో గురువారం దాతల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ బీకే నరసింహులు తన తల్లిదండ్రులు బాపనపల్లి హనుమప్ప, వెంకటమ్మ జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు శివమ్మ, పార్వతి, రమాదేవి, కార్తీక్, సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ఆధ్వర్యంలో : నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రి సమీపంలోని పద్మావతి వృద్ధాశ్రమం, ఓబులాపురం సమీపంలోని శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమాల్లో పట్టణానికి చెందిన హైదరాబాద్ నివాసి దివంగత వారాల కృష్ణకుమారి కుమారులు సురేంద్ర, సతీష్, కుమార్తె లక్ష్మీసుష్మ ఆర్థిక సాయంతో స్ఫూర్తి సభ్యులు అన్నదానం చేశారు.

కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటాం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గిరిజన కుటుంబాలు

అవుకు: కార్యకర్తలు, నాయకులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. అవుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పట్టణానికి చెందిన 30 గిరిజన కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించటమే కాకుండా ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి, పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై చాలామంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ముక్కమళ్ల పుల్లారెడ్డి, అవుకు బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని చిన్న మల్కాపురం గ్రామంలోని సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా 22 నుంచి 25వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మల్కాపురం,రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, ఫ్యాక్టరీలకు మూడు రోజుల పాటు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంట్ సరఫరా చేస్తామన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నాటుసారా విక్రేతల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నాటుసారా, బైక్‌తోపాటు నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సెబ్ సీఐ జోగేంద్ర

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొలిమిగుండ్ల మండలంలో నాటుసారా తయారీ స్థావరాలపై సెబ్ సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది దాడులు నిర్వహించారు. తుమ్మలపెంట గ్రామ సమీపంలో కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన కొలుకొండ సాయినాథ్ మోటార్ సైకిల్‌పై 80 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నారు. నాటుసారాతోపాటు బైక్‌ను సీజ్ చేశామని సీఐ చెప్పారు. అలాగే బందార్లపల్లె వద్ద బండ పెద్దపుల్లయ్య అనే వ్యక్తి నుంచి 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జోగేంద్ర తెలిపారు.

మహానందీశుని దంపతులకు ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు గురువారం రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా ఏకాంతసేవ పూజలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగనన్న



మహిళలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన సీఎం వైఎస్ జగనన్న పేదలకు అన్నివిధాలుగా అండగా నిలిచారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో మహాత్మాగాంధీ నగర్, శేషారెడ్డి నగర్ కాలనీల్లో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ఇబ్రహీమ్‌తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన తనయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మంత్రి బుగ్గన సారథ్యంలో జరిగిన విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధిని వివరించారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి ముందు చూపుతో చెప్పినవి, చెప్పనివి చేసి గత 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి ఐదేళ్ల పాలనలో మంత్రి బుగ్గన చేసి చూయించారని గుర్తు చేశారు. మెరుగైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన కోసం సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, గూని నాగరాజు, రంగస్వామి, చందురెడ్డి, డక్కి శేఖర్, తిరుమలేశ్వర్‌రెడ్డి, సూర్య, అజామ్,ఖాజా, సలీమ్, భాస్కర్, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాలరాజు

బనగానపల్లె రూరల్ : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త ధనలక్ష్మీ తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నేలలోని సారత్వాన్ని కొనసాగించాలంటే ప్రకృతి వ్యవసాయం తప్పనిసరిగా చేయాలన్నారు. వ్యవసాయశాస్త్ర వేత్త రమణయ్య సేంద్రియ ఎరువులవాడకం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగం తదిర అంశాలను వివరించారు. శాస్త్రవేత్త సుధాకర్ సాగు విధానాలు, కొత్త రకాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త బాలరాజు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వివిధ ఉత్పాదకాల తయారీ విధానాలను రైతులకు వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీయం నరేంద్రారెడ్డి ప్రకృతి వ్యవసాయం అవస్యకత, నాణ్యమైన దిగుబడుల ఎలా సాధించాలి అనే విషయాలను రైతులకు వివరించారు.

మహానందిలో రేపు పదహారు రోజుల పండుగ



అంకురాలకు ఏపుగా పెరిగిన మొలకలు

మహానంది: మహానందిలో ఈ నెల 23న పదహారు రోజుల పండుగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కల్యాణోత్సవ దీక్షా విసర్జన, అంకుర విసర్జన, రథాంగ దేవతల ఉద్వాసన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొని శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి అనుగ్రహం పొందాలని కోరారు. ఈ ఏడాది నవధాన్యాల అంకురాలకు మొలకలు బాగా వచ్చాయని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.